# మినీ కథ

# 'జట్టు'

- పాలడుగు వెంకటేశ్వరరావు

ఆ ఆదివారంపూట షాపులన్నీ మూసేసి వున్నాయి. బజార్లన్నీ బోసిగా వెలా తెలా పోతున్నాయి. నీరసంగా రోడ్డు మీద నడుస్తూవున్న ఆదినారాయణ రోడ్డుకి అవతల వున్న పేవ్‌మెంట్ మీద తలవార్చి నిదానంగా నడిచివస్తూవున్న సూర్యనారాయణని చూసి ఎగిరి గంతేసినంత పని చేశాడు. విజిలేశాడు.

'ఒరేయ్!'

ఆ పిలుపుకి నడక ఆపి తలెత్తి చూశాడు సూర్నాణ. అతని మొహంనిండా విషాదం నిండి వుంది. గబగబా రోడ్డు క్రాస్‌చేసి, అతన్ని సమీపించి, ఆప్యాయంగా భుజం మీద చెయ్యివేసి, 'ఏంవాయ్! మైడియర్ షేక్స్పియర్! సంతోషంతో గలగలలాడ్తూ వుండాల్సిన నువ్వు ఈ పూట ఇలాగ వడలిన తోటకూర కాడ లాగ వున్నావ్?' అని మళ్ళీ ప్రశ్నించాడు ఆదినాణ. మౌనమే సమాధానం కాగా, 'ఏమయిందిరా నీకూ? అసలుప్రొద్దుటే ఎక్కడికి వెళ్ళివస్తున్నావు?' అని మళ్ళీ ప్రశ్నించాడు ఆదినాణ. దీర్ఘంగా ఒక నిట్టూర్పు వదిలి 'ఫ్రెండూ! నీ కోసమనే మీ ఇంటికి వెళ్ళివస్తున్నాన్రా. తలుపు తట్టగానే—'ఎవరదీ? వెధవది సెలవ రోజుల్లో కూడా మనుషుల్ని ఇంటిపట్టున ప్రశాంతంగా వుండనీయరు! మాయదారి సంత' అని తిట్టుకుంటూ తలుపు తీసింది మా చెల్లాయి- అనగా నీ శ్రీమతి' అని ఆగాడు సూర్నాణ.

ముసిముసిగా నవ్వుకుంటూ—'అలాగా! అప్పుడేమయింది?' అని సూర్నాణని ఆదినారాయణ అడగ్గా, 'నా బొందయింది' అని బుసలుగొట్టాడు సూర్నాణ. 'అంత మాత్రానికే అలా దవునయిపోకురా చిట్టితండ్రీ, ఆ తర్వాత ఏమయిందో చెప్పవచ్చునుగదా!' అని సముదాయించాడు ఆదినాణ.

'మీరా మహానుభావా! పెళ్ళాం, పిల్లల్నీ, ఇంటినీ వదిలేసి ఒక వారం వర్జ్యం లేకుండా జట్టు కట్టి గాలి తిరుగుళ్ళు తిరగడానికి సిగ్గులేదూ? మా ప్రాణానికి శనిలాగా దాపురించావు గదా మహానుభావా! మంగళాకారా!' అంటూ ఆవిడ విరుచుకుపడిందిరా, నానా శాప నార్థాలూ పెట్టిందిలే! తన కడుపులో రగులుతున్న బాధని, సెగలు గ్రక్కే అగ్ని పర్వతపు లావాలాగా, నా మీద గ్రుమ్మరించింది.! నీ మీద విరుచుకుని పడవలసిన పెనుతుపాను నా మీద పడింది' అని మళ్ళీ నిట్టూర్చాడు సూర్నాణ.

'అప్పుడు నువ్వు ఏం చేశావు?'

'అసలు నువ్వు చాలా మంచివాడివట. అటువంటి నిన్ను నేనే పనిగట్టుకుని చెడగొడ్తున్నానట. నీ పిల్లల వుసురు నాకు తగుల్తుందట. నా పాపం పూరికే పోదట. ఇలా ఎన్నెన్నో అని, నన్ను నాలుగూ దులిపి, వుతికి, ఆరేసి, నా నవనాడులూ క్రుంగిపోయేటట్లు చేసిందిరా మీ యావిడ!'

'పాపం! నువ్వు ఏం చేసి ఏడిచావనిగదా నా ప్రశ్న'

'ఏమి చెయ్యడానికీ తోచక, ఒక వెధవ మొహం పెట్టి, లోలోపలే తనివితీరా ఏడ్చుకుని, తిరుగు మొహం పట్టానురా, ఏం చేశావేంచేశావంటే, ఏం చేశానని చెప్పి ఛావగలనూ?'

'నాన్సెన్స్. గొప్ప వెధవ పని చేశావు గాని, ఇంద ఈ సిగిరెట్ కాల్చు'

'వద్దులే! మనసు బావుండలేదు.'

'మధ్యలో ఆ వెధవ మనసుకేమయిందిటా?'

'నీకేం ఒడ్డున వుండి ఎన్నయినా చెపుతావ్! నువ్వు తావ్ కూడానూ. బురద పడింది నామీదనేగదా! వెధవ రాస్కెలని. డాంపూల్. ఇకనుండి నీకూ నాకూ అసలు సంబంధం లేదు. నీ స్నేహం నాకు వద్దు. నీ పెళ్ళాం నన్ను అంతంత మాటలు అన్నాక నేనెంత వెధవ వీక్ ఫెలోనయినా, నిన్ను నమ్ముకుని మునిగి పోయేటంత వెధవాతి వెధవని కానురా!' అని చిందులు వేశాడు సూర్నాణ రోషంగా.

విషాదంగా ఒక నవ్వు నవ్వి—'ఒరే వెధవాయి ఇటు మాడరా' అన్నాడు ఆదినాణ. అటు చూసి ఆశ్చర్యపోయి—'ఏంటా్రి? ఏంటీ గాయం?' అని ఆదుర్దాగా అడిగాడు సూర్నాణ.

'నేనూ నీ కోసమని మీ ఇంటికి వెళ్ళాను. అక్కడ తలుపు తీసిన మా చెల్లాయి—అదే మీ యావిడ—నామీద విరుచుకు పడింది. నా నోరు వూరుకోదుగదా, వేడిగా వాడిగా గుమ్మంలోనే ఆర్గుమెంట్లయ్యాయి. ఆమె కోపం పట్టలేక చేతిలో వున్న గరిటని విసురుగా నా మీదకి విసిరి, దభాల్న తలుపు వేసుకుంది. నువ్వు ఇంట్లో లేవని తెలుసుకుని ధీరోచితంగా నిన్ను వెతుక్కుంటూ తిరిగి వస్తున్నాను. నీ మీద కంటే ఎక్కువగానే నా మీదా బురద పడింది. 'నాథుల్పేరముల్పేయు బేరలుకం చెందినయట్టి కాంతలుచిత వ్యాపారముల్నేర్తురే! అన్నాడుగదా తిమ్మన్న! స్నేహం కాదా జీవితం! స్నేహమే గదా శాశ్వతం! ఇంత మాత్రానికే అదిరి, బెదిరి నీ స్నేహం వదులుకుంటానా నేను? అవసరాన్ని బట్టి ఏదో సర్దుకుపోవాలి. బరువుగా, బాధగా అనిపించే మన క్రింది, మధ్య తరగతి బ్రతుకు బాటల్లో, మన ఈ స్నేహం ఒక ఒయాసిస్సు కాదా?'

'నిజమేరా! ఏదీ సిగరెట్టూ? రాస్కెల్స్! ఎవర్రా మనల్ని విడదీయగలిగింది?'




'ఇంద తీసుకో. వెలిగించుకుని తృప్తిగా గుండెల్నిండా పీల్చుకో. పద పోదాం.'

ఇద్దరూ చేతులు కలుపుకుని, రాంబాబు రూమ్‌కి పేకాడుకుంటానికని కులాసాగా సాగిపోయారు.

*